ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY


5

వనపర్తి

జిల్లా వార్తలు

మంగళవారం 1 జూలై 2025

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 33.0 కనిష్ఠం : 24.0





పత్తి రైతు పరేషాన్

● సీడ్ పత్తి విత్తన ఉత్పత్తిపై సీలింగ్...!



అంక్షలతో పత్తి పంటను తొలగిస్తున్న రైతులు

- ఎకరాకు 200 ప్యాకెట్లే తీసుకుంటామని మెలిక
- లేదంటే పంటలను తొలగించుకోవాలని సూచన
- గత ఏడాది భారీగా సీడ్ పత్తి దిగుబడులు
- దీంతో కంపెనీల వద్ద పెరిగిపోయిన నిల్వలు
- మార్కెట్‌లో విక్రయాలు తగ్గడం కూడా కారణం
- విత్తనాలు వేశాక ఆంక్షలు పెట్టడంపై రైతుల ఆగ్రహం

6

పత్తి రైతుకు చిక్కొచ్చిపడింది. సీడ్ విత్తన ఉత్పత్తిపై సీలింగ్ పెట్టడంతో పరేషాన్‌లో పడ్డాడు. మారుతున్న పరిణామాలతో దిక్కుతోచక ఆందోళన చెందుతున్నాడు. విత్తనం విత్తి నెల రోజులైందని, ఇప్పుడు ఇలాంటి ఆంక్షలు పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాడు. జోగుళాంబ గద్వాల జిల్లాలో సీడ్ పత్తి విత్తనోత్పత్తి సాగు దాదాపు 57వేల ఎకరాలలో చేశారు. ఇందులో దాదాపు 30వేల నుంచి 40వేల మంది రైతులు దీనినే నమ్ముకున్నారు. వేల మంది కూలీలకు ఉపాధిని ఇస్తుంది. ఇంత ప్రాధాన్యం ఉన్న విత్తన ఉత్పత్తిపై కంపెనీలు మెలిక పెట్టడం గమనార్హం. దీనికంతటికీ సీడ్ నిల్వలు పెరిగిపోయి, విక్రయాలు తగ్గిపోయాయని గుర్తించి ఆంక్షలు పెట్టడమే కారణంగా తెలుస్తున్నది. మరి ఈ పరిణామం ఎటు వెళ్తుందో చూద్దాం.

- గద్వాల, (ఆంధ్రజ్యోతి)



మొక్కలను తొలగించమన్నారు

నేను మూడు ఎకరాల్లో సీడ్‌పత్తి సాగు చేశా. దాదాపు నెల రోజులు గడిచింది. ఎకరాకు రూ.50వేలకు పైగా పెట్టుబడి పెట్టాను. ఆర్గనైజర్ నాకు ఫోన్ చేసి సీడ్ వద్దు పంటను తొలగించి వేరే పంట వేసుకోమన్నాడు. నేను నష్టపోతాను అంటే నీవు నష్టమైనపో... అప్పు పడితే భూమైన అమ్ముకో నాకు ఆ పంటతో సంబంధం లేదు. నష్టపోకూడదంటే దానిని కమర్షియల్‌కు వదిలేసుకో అంటున్నాడు. నీవు ఇట్ల చేస్తే అప్పు చెల్లించను అంటే ఆయన ఎట్ల చెల్లించవో నేను చూస్తాను అని ఫోన్ పెట్టేశాడు.

- తిప్పన్న, రైతు ఆరగిద్ద, గట్టు మండలం

టైగర్ సఫారీకి మూడు నెలల విరామం

- నల్లమల సందర్శనకు ఎవ్వరూ రావొద్దు : డీఎఫ్‌వో



సఫారీ వాహనాల్లో వెళుతున్న పర్యాటకులు(ఫైల్)

మన్ననూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే రెండో అతిపెద్దదైన అమ్రాబాద్ పులుల అభయారణ్య ప్రాంతంలో విజయవంతంగా పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచుతున్న టైగర్ జంగల్ సఫారీకి వైల్డ్‌లైఫ్ 3 నెలలు విరామం ప్రకటించింది. ప్రతీ ఏటా జూలై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు పెద్దపులులతో పాటుగా ఇతర వన్యప్రాణులకు సంతానోత్పత్తి జరిపే సమయంగా వైల్డ్‌లైఫ్ నిర్ధారించింది. ఇకో టూరిజం ద్వారా మన్ననూరు నుంచి ఫర్హాబాద్ వ్యూపాయింట్ వరకు, దోమలపెంట నుంచి అక్కమహాదేవి గుహల వరకు పర్యాటకులకు అనుమతించే జంగల్ బుక్ టైగర్ సఫారీని నిలిపి వేస్తున్నట్లు అటవీశాఖ ఉన్నతాధికారులు ప్రకటించారు. అటవీ నిబంధనలు - మిగతా 6లో..

హలో అమ్మా.. బాగున్నావా..



- గురుకుల పాఠశాలల్లో 'ఫోన్ మిత్ర'
- పిల్లలకు తల్లిదండ్రులతో మాట్లాడే అవకాశం

బుద్దారం గురుకులంలో తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడుతున్న విద్యార్థినులు

6

పుంజుకున్న జల విద్యుత్ ఉత్పత్తి



ఎడమ కాలువ హెడ్ రెగ్యులేటర్ వద్ద భారీగా వచ్చిన వరద

6

లక్ష్యాన్ని చేరుకునే దిశగా అడుగులు వేయాలి

- రూ. 85.50 లక్షలతో అదనపు తరగతి గదులను ప్రారంభించిన మంత్రి జూపల్లి కృష్ణారావు



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు

పాన్‌గల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): 'తల్లిదండ్రులు కష్టపడి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎన్నో ఆశలు మీపై పెట్టుకుంటారు... కాబట్టి విద్యార్థులు తమ లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేయాలని' రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం వనపర్తి జిల్లా పాన్‌గల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అదనపు తరగతి గదులను, ప్రయోగశాల గదిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... బాలికలు లక్ష్యాన్ని ఎంచుకుని అది సాధించే వరకు వదిలి పెట్టొద్దని అన్నారు. మెరుగైన విద్యను అందించేందుకు పీఎంశ్రీ పథకం కింద 85.50 లక్షలతో మంజూరైన నిధులతో అదనపు తరగతి గదులను కస్తూర్బా గాంధీ పాఠశాల యందు నిర్మించుకున్నట్లు తెలిపారు. అదే విధంగా విద్యార్థినులు అధునాతన టెక్నాలజీని ఉపయోగించుకోవాలని అన్నారు. అంతకుముందు మల్లాయిపల్లి గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారులకు పట్టాల పంపిణీ చేశారు. అదే విధంగా చింతకుంట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల చదువుపై ఆరా తీశారు.

బల్కంపేట ఎల్లమ్మకు పట్టు వస్త్రాలు

- గద్వాల జములమ్మ ఆలయం తరపున సమర్పణ

7

నేడు 'జూరాల' పరిశీలనకు జాన్‌వెస్లీ

7

చికిత్స పొందుతూ యువకుడి మృతి

- ప్రేమించి పెళ్లి చేసుకున్న యువతి దక్కలేదని ఆత్మహత్యాయత్నం

7

మరింత విస్తృతంగా రెడ్‌క్రాస్ సేవలు

- జోగుళాంబ గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్

6

అడ్డగోలుగా అమ్మకాలు?

● పుట్టగొడుగుల్లా మెడికల్ దుకాణాలు



పెబ్బేరు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలోని మెడికల్ దుకాణంలో తనిఖీలు చేపడుతున్న డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ అన్నవరం రష్మి(ఫైల్)

- వనపర్తి జిల్లాలో బ్రాండెడ్ పేరిట విక్రయాలు
- జనరిక్ మందులపై అవగాహన కరువు
- నాణ్యతా ప్రమాణాలు కరువు
- కొరవడుతున్న ఔషధ నియంత్రణ శాఖ అధికారుల పర్యవేక్షణ

వనపర్తి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వస్తున్న మార్పులతో ప్రబలుతున్న రోగాలను ఆసరాగా చేసుకుని మెడికల్ దుకాణాల నిర్వాహకులు ఇష్టమొచ్చిన నాణ్యత ప్రమాణాలు లేని మందులను అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. అర్హత లేకపోయినా ఏడాపెడా యాంటి బయోటిక్‌మందులను విక్రయిస్తూ పేదల ఆరోగ్యంపై ఆడుకుంటున్నారు. కొందరు వైద్యులు జలుబు, దగ్గు, జ్వరం ఏ చిన్న రోగం వచ్చినా నాణ్యతాప్రమాణాలు లేని మందులను అంటగడుతూ దండుకుంటున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే జబ్బు పేరు చెప్పగానే మోతాదుకు మించి డోస్ ఇచ్చేస్తున్నారు. ఈ వ్యాపారమంతా ఔషధ నియంత్రణ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోందన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా ఔషధ నియంత్రణ శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం గమనార్హం. వనపర్తి జిల్లాలో ఏడాదిలో నాలుగైదు కేసులు కూడా నమోదు కావడం లేదంటే ఆ శాఖ పనితీరు ఏ విధంగా ఉందో తెలుస్తూనే ఉన్నది.

నిబంధనలు పాటించని మెడికల్ షాపుల్లో తరచూ తనిఖీలు నిర్వహిస్తే అధిక ధరలకు అడ్డుకట్ట వేసే అవకాశం ఉంటుందన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు 270 రిటైల్, 40 హోల్‌సేల్ మెడికల్ దుకాణాలు ఉన్నాయి. ఇవే కాకుండా జనరిక్ 3, జీవన్‌ధార్ మెడికల్ దుకాణాలు 5 ఉన్నాయి. ఈ దుకాణాలన్నింటిలో కూడా ధరలకు అడ్డూ అదుపూ లేకుండా అడ్డగోలుగా దోచుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మార్కెట్లో అతి చౌక ధరలకు లభించే జనరిక్ మందుల జోలికి ప్రజలకు అవగాహన లేక అసలు వెళ్లడం లేదు.

● ఏది జనరిక్... ఏది బ్రాండెడ్?

జనరిక్ మందులపై ప్రజల్లో కనీస అవగాహన కనిపించడం లేదు. దీంతో ఏది జనరిక్? ఏది బ్రాండెడ్ అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జనరిక్ మందులు బ్రాండెడ్ మందుల కంటే 30 నుంచి 60 శాతం వరకు తక్కువ ధరల్లోనే లభిస్తాయి. కానీ సంబంధిత శాఖ అధికారులు మందు గోలీల ధరలపై ప్రజల్లో కనీస అవగాహన కల్పించం లేదు. డ్రగ్స్ అండ్ కాస్మోటిక్ చట్టం నిర్దేశించిన నాణ్యత, రసాయన ప్రమాణాలు కూడా ఈ జనరిక్ మందుల్లో కలిగి ఉంటాయి. కానీ వైద్యులు అవేవీ పట్టించుకోకుండానే మందుగోలీలను రాస్తూ వదిలేస్తున్నారు. అలాగే వీటిపై పన్నుల భారం కూడా తక్కువగానే ఉండటంతో చౌకధరల్లోనే లభిస్తాయి. అన్ని ఫార్మా కంపెనీలు బ్రాండెడ్ మందులతో పాటు జనరిక్ మందులను కూడా తయారు చేస్తాయి. బ్రాండెడ్ మందులలోనే అధిక లాభాలు రావడంతో జనరిక్ మందుల వైపు దృష్టి సారించడం లేదంటున్నారు. కొందరు జనరిక్ మందులనే బ్రాండెడ్ మందుల స్థాయిలో విక్రయిస్తున్నట్లు తెలుస్తున్నది.

● పర్యవేక్షణ ఏది ?

మెడికల్ దుకాణాల్లో నాణ్యత ప్రమాణాలు లేని మందులను విక్రయిస్తున్న వారి అక్రమాలకు అడ్డుకట్ట వేసి మందు గోలీల ధరలను కట్టడి చేసేలా చర్యలు తీసుకోవాల్సిన ఔషధ నియంత్రణ అధికారుల పర్యవేక్షణ ఏదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏదైనా ఫిర్యాదు వస్తేనే తప్పా లేకపోతే ఆ వైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత వారం రోజుల క్రితం పెబ్బేరు పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రిలో గర్భవతికి కాలం చెల్లిన మందులు విక్రయించిన కూడా చర్యలు తీసుకోవడంలో అధికారులు అలసత్వం ప్రదర్శించారు. ఫిర్యాదు చేసిన రెండు రోజులకు వచ్చి తనిఖీలు చేపట్టి వారం రోజులు మెడికల్ దుకాణాన్ని సీజ్ చేస్తున్నట్లు తెలిపారు. కానీ క్షేత్రస్థాయిలో జరిగిన విషయంపై బాధితులను పిలిచి వారి నుంచి వివరణ కోరకుండానే తనిఖీలు చేపట్టి వెళ్లడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గద్వాలలో మోస్తరు వర్షం



జలమయమైన గద్వాలలోని కృష్ణవేణిచౌరస్తా-నదీ అగ్రహారం రహదారి

గద్వాల సర్కిల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గద్వాలలో సోమవారం రాత్రి 7.30 గంటల ప్రాంతంలో ఓ మోస్తరు వర్షం పడింది. అరగంట పాటు కురిసిన వర్షానికి గద్వాల పుర పరిధిలోని ప్రధాన మార్గాలైన కృష్ణవేణిచౌరస్తా, రాజీవ్‌మార్గ్, నదీ అగ్రహారం మార్గం రెండవ రైల్వే గేట్ తదితర దారులన్నీ జలమయమయ్యాయి. ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు. గుంతలు పడ్డ పలు రహదారులపై నీరు ప్రవహిస్తుండటంతో గమనించక కొందరు ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కిందపడ్డారు.

సమయ పాలన పాటించాలి

- డీఈవో రమేష్‌కుమార్

పెద్దకొత్తపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని, విద్యా ప్రమాణాలను పెంచేందుకు కృషి చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రమేశ్‌కుమార్ అన్నారు. సోమవారం పెద్దకొత్తపల్లి మండలంలోని వావిళ్లబావి, బాచారం ప్రాథమిక పాఠశాలలు, కల్వకోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈవో రమేష్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాలను, మధ్యాహ్న భోజనాన్ని, పరిసరాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందించాలని సూచించారు. విద్యార్థులు ప్రతీ రోజు పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని, ఉపాధ్యాయులు విధిగా పాఠశాలలకు సమయం పాటించాలని ఆయన సూచించారు. పాఠశాలలో విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని డీఈవో సూచించారు. డీఈవో వెంట జిల్లా బాలిక విద్యా కో ఆర్డినేటర్ శోభారాణి, జిల్లా టెస్ట్ బుక్ మేనేజర్ మానవపాడు నరసింహులు ఉన్నారు.



బాచారంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో రమేష్‌కుమార్

వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

- ఆరోగ్యశ్రీ రాష్ట్ర సీఈవో ఉదయ్ కుమార్
- మెడికల్ కళాశాల, జనరల్ ఆసుపత్రి పరిశీలన



డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆరోగ్యశ్రీ రాష్ట్ర సీఈవో ఉదయ్‌కుమార్, కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి వైద్యవిభాగం/గద్వాల న్యూటౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆరోగ్యశ్రీ రాష్ట్ర సీఈవో ఉదయ్ కుమార్ ఆదేశించారు. సోమవారం ఆయన జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆదర్శ్ సురభి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. జిల్లా పర్యటనలో భాగంగా మెడికల్ కళాశాల, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి పరిశీలించారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కిరణ్మాయి ప్రొజెక్టర్ ద్వారా ప్రస్తుతం ఉన్న మౌలిక సదుపాయాలు, కావాల్సిన మౌలిక సదుపాయాలను వివరించారు. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల కొరత ఉందని, విద్యార్థులకు ట్రాన్స్‌పోర్ట్, క్యాడవర్‌ల కొరత ఉందని సీఈవో దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించారు. ఉన్న వసతులు, ఎంత మందికి డయాలసిస్ చేస్తున్నారు? సమస్యలు ఏంటని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆరోగ్యశ్రీ సిబ్బందితో మాట్లాడారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా మెడికల్ కో ఆర్డినేటర్ డాక్టర్ రమాదేవి, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగారావు, ఆర్ఎంవో డాక్టర్ శివప్రసాద్, ఇతర వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించే విధంగా అవసరమైన సదుపాయాలను ప్రభుత్వం సమకూరుస్తున్నదని ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్‌కుమార్ అన్నారు. సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యకళాశాల, ఆసుపత్రి మానిటరింగ్ కమిటీ సభ్యులు, జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్‌లతో కలిసి కళాశాలను పరిశీలించారు. అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, వైద్యపరికరాలు, విద్యాప్రమాణాలు, తదితర అంశాలపై సమగ్ర సమీక్షను నిర్వహించారు.

ఆసుపత్రి, మెడికల్ కళాశాల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కమిటీ సభ్యులు నాగర్‌కర్నూల్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, , ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఇందిర, టీ.ఎస్.ఎం.ఐ. డి.సి.డి.ఈ శ్రీనివాసులు, అన్ని విభాగాల హెచ్‌వోడీలు, వైద్యసిబ్బంది ఉన్నారు.

ప్రమాద హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

» సోమశిల వద్ద కృష్ణానదిలో పెరుగుతున్న నీటి మట్టం



సోమశిల కృష్ణానది వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న పోలీసు అధికారులు

కొల్లాపూర్, జూన్ 30(ఆంధ్రజ్యోతి) : కృష్ణానదికి వరద పెరుగుతండటంతో నాగర్‌కర్నూల్ జిల్లాలోని పర్యాటక కేంద్రం సోమశిల వద్ద సోమవారం పోలీసులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొల్లాపూర్ ఎస్‌ఐ హృషికేష్ మాట్లాడారు. కృష్ణానది ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో వరద ఉధృతి పెరుగుతోందన్నారు. వరద నీటిలో ఎవరూ దిగొద్దని, విషసర్పాలు, మొసళ్లు ఉన్నాయని తెలిపారు. నదిలో స్నానం చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని అప్రమత్తంగా ఉండాలని ప్రజలు, పర్యాటకులకు సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జానయ్య, మాజీ సర్పంచ్ మద్దిలేటి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావేదిక సభ రసాభాస

» అవినీతి జరిగిందంటూ నాయకుల అభ్యంతరం



మండల కేంద్రంలోని సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారులు

మిడ్జిల్, జూన్ 30: (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్‌లో సోమవారం నిర్వహించిన ఉపాధి హామీ ప్రజావేదిక సమావేశం రసాభాసగా ముగిసింది. ఉపాధి హామీ 15వ విడత సామాజిక తనిఖీపై మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావేదిక సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బృందాల సభ్యులు ఇటీవల గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగులోకి వచ్చిన అవినితి, అక్రమాలకు సంబంధించిన విషయాలను గ్రామాల వారీగా వారు ప్రజావేదిక దృష్టికి తీసుకొచ్చారు. మస్టర్ ఎంట్రీతో పాటు కొలతలు సక్రమంగా లేవని, కొందరు కూలీలకు సక్రమంగా వేతనాలు ఇవ్వలేదని వారు తెలిపారు. మండలంలోని చిలువేరు, వెలుగొమ్ముల, సింగందొడ్డి, మిడ్జిల్, భైరంపల్లి, వల్లభురావుపల్లి, చౌటకుంటతండా, లింబ్యాతండా, దోనూర్, కొత్తూర్ గ్రామాల్లో నిర్వహించిన ఉపాధిహామీ పనులకు సంబంధించిన వివరాలను చదివి వినిపించారు. మండల కేంద్రంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో అవినితి జరిగినట్లు గ్రామానికి చెందిన నాయకులు ఆరోపించారు.

చేసిన పనుల కంటే ఎక్కువ డబ్బులు డ్రా చేశారని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పట్టుబట్టారు. రోడ్డు, ఫీడర్ చానల్‌కు సంబంధించిన పనుల కొలతలు సక్రమంగా లేవని ఆందోళనకు దిగారు. అదే సమయంలో గ్రామానికి చెందిన టెక్నికల్ అసిస్టెంట్ హర్షిత కళ్లు తిరిగి పడిపోయింది. తోటి సిబ్బంది పరిచర్యలు చేయడంతో కోలుకున్నది.

అనంతరం సమావేశాన్ని కొనసాగించారు. మిగిలిన గ్రామాలకు సంబంధించిన పనులపై మంగళవారం విచారణ చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. విచారణ అనంతరం పూర్తి వివరాలను వెల్లడించనున్నట్లు చెప్పారు. సమావేశంలో అడిషనల్ డీఆర్‌డీవో ముసాయిదాబేగం, అంబుడ్స్ పర్సన్ సంతోష్, జిల్లా విజిలెన్స్ అధికారి ప్రేమలత, ఎంపీడీవో గీతాంజలి, ఏపీవో రాజేశ్‌కుమార్‌లతో పాటు సామాజిక తనిఖీ బృందాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

రేవల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా, రేవల్లి మండలంలోని తలుపునూరుకు చెందిన ఉప్పరి రేణుక (23) అనే వివాహిత అదృశ్యమైనట్లు ఎస్‌ఐ రజిత తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఉప్పరి దస్తగిరి, రేణుక దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. శనివారం సాయంత్రం అయిదు గంటలకు రేణుక ఫోన్‌లో మాట్లాడుతుండగా భర్త గమనించాడు.

ఇంత సేపు ఎవరితో మాట్లాడుతున్నావంటూ ఆమె ను మందలించాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. మరుసటి రోజు ఆదివారం ఉదయం తెల్లవారుజామున అయిదు గంటలకు దస్తగిరి నిద్రలే చి చూడగా, ఇంట్లో రేణుక కనిపించలేదు. చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో, బం ,దువుల ఇళ్లల్లో ఆరా వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో దస్తగిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

హలో అమ్మా.. బాగున్నావా!

- » గురుకుల పాఠశాలల్లో 'ఫోన్ మిత్ర'
- » విద్యార్థుల సంఖ్యను బట్టి ఫోన్ల ఏర్పాటు
- » పిల్లలకు తల్లిదండ్రులతో మాట్లాడే అవకాశం
- » సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్



బుద్దారం గురుకుల పాఠశాలలో తల్లిదండ్రులతో ఫోన్ మాట్లాడుతున్న విద్యార్థినులు

వనపర్తి విద్యావిభాగం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులకు దూరంగా, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఇంటిపై బెంగతో ఇబ్బంది పడుతుంటారు. తల్లిదండ్రులతో ప్రతీ రోజు మాట్లాడాలని అనుకుంటుంటారు. కానీ ఫోన్ సౌకర్యం అందుబాటులో లేదని బాధ పడుతుంటారు. వారి ఆవేదనను గుర్తించిన ప్రభుత్వం 'ఫోన్ మిత్ర' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఈ విద్యాసంవత్సరం ఆరంభంలోనే విద్యార్థుల సంఖ్యను బట్టి టెలిఫోన్‌లను ఏర్పాటు చేసింది.

ప్రతీ రోజు 25 నిమిషాలు

స్మార్ట్‌కార్డుల ద్వారానే విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసే అవకాశం ఉంటుంది. ప్రతీ రోజు 25 నిమిషాలు మాట్లాడుకోవచ్చు. ఒక్కో కార్డును ఐదుగురు విద్యార్థులు వినియోగించుకోవచ్చు. ఒక విద్యార్థి ఐదు నిమిషాలు మాట్లాడవచ్చు. అందుకోసం కార్డుల్లో విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్ నెంబర్లను నమోదు చేస్తారు. దీంతో పాటూ ఒక టోల్ ఫ్రీ నెంబర్ (గురుకుల అధికారి) కూడా ఉంటుంది. విద్యార్థులకు ఏ సమస్యలు ఎదురైనా ఈ నెంబర్‌కు ఫోన్ చేసి చెప్పవచ్చు.

మానసిక ఒత్తిడి తగ్గుతుంది

విద్యార్థులు ఇంటికి దూరంగా ఉండాల్సి రావడంతో మానసిక ఒత్తిడికి లోనవుతుంటారు. గురుకులాల్లో ఏర్పాటు చేసిన ఫోన్లలో ప్రతీ రోజు తల్లిదండ్రులతో మాట్లాడటంతో ఒత్తిడి తగ్గి చదువుపై ధ్యాస పెరుగుతుంది. అయిదుగురికి ఒక స్మార్ట్ కార్డు చొప్పున అందించాం. విద్యార్థులు తమకు కేటాయించిన సమయంలో ప్రతీ రోజు ఐదు నిమిషాల పాటు కుటుంబ సభ్యులతో మాట్లాడుకోవచ్చు.

\- ప్రమోద, డిస్ట్రిక్ కో ఆర్డినేటర్

ఆరు గురుకులాల్లో ఫోన్ మిత్ర సేవలు

వనపర్తి జిల్లాలో మదనాపురం, వీపనగండ్ల బాలుర గురుకులాలతో పాటూ, గోపాల్‌పేట, పెద్దమందడి, కొత్తకోట, వనపర్తి బాలికల గురుకుల పాఠశాలల్లో 3,840 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారందరికీ 'ఫోన్ మిత్ర' సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. దీంతో విద్యార్థులు ప్రతీ రోజు తల్లిదండ్రులతో మాట్లాడుకునే అవకాశం ఉంటుంది. ప్రతీ రోజు క్షేమ సమాచారాలు తెలుసుకోవచ్చని అటు కుటుంబ సభ్యులు, ఇటు విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు ఆర్టీసీ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

మహబూబ్‌నగర్ టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వీవీ కన్వెన్షల్ హాల్‌లో నేడు ఆర్టీసీ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మజ్దూర్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రవీందర్‌రెడ్డి, శ్రీనివాసాచారి, జిల్లా ప్రచార కార్యదర్శి భానుప్రకాశ్‌రెడ్డి సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపకుడు, ప్రధాన కార్యదర్శి అశ్వత్థామరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటున్నారని తెలిపారు.

'సరకుల పంపిణీలో టెండర్లు అమలు చేయాలి'

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ బీసీ సంక్షేమ హాస్టల్స్‌కు నిత్యావసర సరుకుల పంపిణీలో టెండర్ల విధానం అమలు చేయాలని బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు దన్నోజు అరవింద్‌చారి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఖాజా నజీమ్ అలీ అఫ్సర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని బీసీ సంక్షేమ హాస్టల్స్‌కు కిరాణం సరుకుల మాదిరిగా కూరగాయలు, చికెన్, గుడ్లు, పాలు వంటి సరుకుల పంపిణీలో టెండర్ విధానం లేకపోవడంతో నాణ్యత లోపించిందన్నారు. దీంతోపాటు అవకతవకలు కూడా జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం టెండర్ విధానం అమలు చేసి మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆయన కోరారు.

టైగర్ సఫారీకి మూడు నెలల విరామం

(5వ పేజీ తరువాయి)

ఉల్లంఘించి ఎవరైనా నల్లమలలో సంచరిస్తే చట్టపరంగా శిక్షార్హులవుతారు.

పెద్దపులి సిగ్గరి...

నల్లమల అభయారణ్య ప్రాంతంలో జూలై నుంచి సెప్టెంబర్ మాసం వరకు పెద్దపులులు జతకట్టే కాలం. అడవిలో వర్షాలు కురిసి చెట్లు విస్తారంగా పెరగడంతో ప్రశాంతమైన వాతావరణంలో పెద్దపులులు, ఇతర వన్యప్రాణులు జతకట్టి సంతానోత్పత్తి జరుపుతాయి. అడవిలో ఎలాంటి మానవ అలజడి తగిలినా వాటి ఏకాంతతకు భంగం వాటిల్లుతుంది. పెద్దపులులు సంతానోత్పత్తితో పిల్లలతో కూడి ఉన్న సందర్భంలో మానవుల అలజడి వినిపించినా, తారసపడినా దాడులు సైతం చేసే ఆస్కారం ఉంటుంది.



అమ్రాబాద్ పులుల అభయారణ్య ప్రాంతం



నల్లమలలో సంచరిస్తున్న పెద్దపులి (ఫైల్)

పెద్దపులుల పెంపునకు అటవీశాఖ చర్యలు

అమ్రాబాద్ పులుల అభయారణ్యంలో అధికార యంత్రాంగం చేపట్టిన సంరక్షణ చర్యలు, అడవిలో ప్లాస్టిక్ వ్యర్థాలు పడకుండా చేయడం, సీసీ ట్రాప్ కెమెరాల పర్యవేక్షణలో పెద్దపులులు ఇతర వన్యప్రాణుల కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉంటారు. వాటికి కావాల్సిన ఆహార వనరులను ఏర్పాటు చేస్తూ ఉండటంతో ప్రతి ఏటా అమ్రాబాద్ అభయారణ్యంలో పెద్దపులుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. 2024 గణాంకాల ప్రకారం పెద్దపులులు 34, చిరుత పులులు 170కి పైగా, ఇతర వన్యప్రాణుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. రాబోయే రోజుల్లో వటవర్లపల్లి, కుడిచింతలబైలు, సార్లపల్లి గ్రామాలను మైదాన ప్రాంతాలకు తరలించి పునరావాస ప్యాకేజీని అందించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ గ్రామాలన్నీ తరలిపోతే పెద్దపులులకు ఇక్కడ ఆవాసం ఉండేందుకు సురక్షిత ప్రాంతంగా అటవీ అధికారులు తయారు చేయనున్నారు.

పర్యాటకులు సహకరించాలి



ప్రతి ఏటా మాదిరే జూలై1 నుంచి సెప్టెంబరు 30 వరకు టైగర్ సఫారీ టూర్‌కు వచ్చే పర్యాటకులు నిషేధాన్ని అమలు చేసేందుకు అటవీశాఖకు సహకరించాలి. ఎన్‌టీసీఏ మార్గదర్శకాల ప్రకారం పెద్దపులులు, వన్యప్రాణుల సంరక్షణలో ఇది ఒక ముఖ్యమైన చర్య. మళ్లీ అక్టోబర్ 1 నుంచి టైగర్ సఫారీని పునః ప్రారంభిస్తాం.

\- డీఎఫ్‌వో రోహిత్ గోపిడి

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి



కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

పాలమూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పంచాయతీలో పని చేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు చెల్లించాలని టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సి.వెంకటేష్, జిల్లా కార్యదర్శి సాంబశివుడు డిమాండ్ చేశారు. సోమవారం పంచాయతీ కార్మికులతో కలిసి కలెక్టర్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం గ్రీన్ ఛానల్ నుంచి వేతనాలు ఇస్తామని చెప్పి ఆరు నెలల నుంచి వేతనాలు ఇవ్వటం లేదన్నారు. కార్మికుల పరిస్థితులు దినదినగండంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు పుట్టక ఒక్క పూట భోజనానికి గగనమైపోయిందన్నారు. పంచాయతీ ఎన్నికలు నిర్వహించకపోవటం, 15 ఫైనాన్స్ నుంచి అయినా వచ్చే డబ్బులు రావటం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం కలుగ చేసుకుని కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలన్నారు. తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ కార్మిక సంఘం నాయకులు, కురుమన్న, వెంకటేష్, బృందమ్మ, బాలయ్య, కిష్టన్న, నాగన్న, హనుమంతు, బాలమ్మ పాల్గొన్నారు.

మరింత విస్తృతంగా రెడ్‌క్రాస్ సేవలు

» జోగుళాంబ గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్



రెడ్‌క్రాస్ సొసైటి సభ్యుడు సంగాల అయ్యపురెడ్డిని సన్మానిస్తున్న కలెక్టర్

గద్వాల న్యూటౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా భవిష్యత్తులో మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు అన్ని విధాలా సహకారం అందిస్తామని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన రెడ్‌క్రాస్ సొసైటీ వార్షిక సర్వసభ్యసమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2022 నుంచి 2025 వరకు సొసైటీ ఆధ్వర్యంలో చేసిన సేవ కార్యక్రమాలు అత్యంత అభినందనీయమన్నారు. సొసైటీ కాలపరిమితి పూర్తయినందున ఎన్నికల ప్రక్రియను చేపట్టాలని సూచించారు. అందుకోసం ప్రత్యేక ఎన్నికల అధికారిని నియమించినట్లు చెప్పారు. ఈనెల 18న ఎన్నికలను ఓటింగ్ ప్రక్రియ ద్వారా నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఉత్తమ సేవలందించిన సభ్యులను అభినందించి జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ రమేశ్, రాష్ట్ర ఈసీ మెంబర్ డాక్టర్ మోహన్‌రావు, వైస్ చైర్మన్ తాహిర్, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

పుంజుకున్న జల విద్యుత్ ఉత్పత్తి




దిగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం

ఆత్మకూరు/అమరచింత, జూన్ 30(ఆంధ్రజ్యోతి) : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు పరిధిలోని ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి వేగం పుంజుకున్నదని ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎగువ జల విద్యుత్ కేంద్రంలో ఐదు యూనిట్లను ప్రారంభించి సోమవారం 2.828 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేపట్టినట్లు చెప్పారు. ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు మొత్తం 73.521 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసినట్లు తెలిపారు. దిగువ జల విద్యుత్ కేంద్రంలో ఆరు యూనిట్ల ద్వారా సోమవారం నాటికి 3.907 బిలియన్ యూనిట్ల ఉత్పత్తిని రాబట్టినట్లు తెలిపారు. రెండు జల విద్యుత్ కేంద్రాల్లో మొత్తం 160 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసినట్లు చెప్పారు. వరద ఇదే స్థాయిలో కొనసాగితే తొందరలోనే నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసి, రికార్డు నెలకొల్పే అవకాశం ఉందని తెలిపారు. అలాగే ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ, సమాంతర కాలువల హెడ్ రెగ్యులేటర్ల వద్దకు వరద నీరు భారీగా వచ్చి చేరింది. ఖరీఫ్ పంటకు ఎడమ కాలువ నుంచి 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నగదు బదిలీ చేయాలి

సీఎం రేవంత్‌రెడ్డికి మత్స్యకార్మికుల లేఖ



సీఎంకు లేఖ పంపుతున్న నాయకులు

వీపనగండ్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : చేపలకు బదులుగా నగదు బదిలీ చేయాలని వనపర్తి జిల్లా, వీపనగండ్ల మండలంలోని గోవర్దనగిరి మత్స్య కార్మిక సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సోమవారం లేఖ రాశారు. ఈ సందర్భంగా మత్స్యకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాలయ్య మాట్లాడుతూ మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో చేప పిల్లలను సరఫరా చేయడం లేదన్నారు. దీంతో చేప పిల్లలు ఎదగక పోవడంతో లక్షలాది రూపాయలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేప పిల్లలకు బదులుగా మత్స్యకారుల ఖాతాల్లో నగదు జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మత్స్యకార్మిక సహకార సంఘం జిల్లా డైరెక్టర్, గ్రామ అధ్యక్షుడు సురేంద్రబాబు, కార్యదర్శి గుంటి మశేశ్, కోశాధికారి పడిగన్న, నాయకులు ఎం.ఆంజనేయులు, యాటకిరి నాగన్న, సభ్యులు పాల్గొన్నారు.

పత్తి రైతు పరేషాన్

సీడ్ పత్తి విత్తన ఉత్పత్తిపై సీలింగ్...!

- » ఎకరాకు 200 ప్యాకెట్లే తీసుకుంటామని మెలిక
- » లేదంటే పంటలను తొలగించుకోవాలని సూచన
- » గత ఏడాది భారీగా సీడ్ పత్తి దిగుబడులు
- » దీంతో కంపెనీల వద్ద పెరిగిపోయిన సీడ్ నిల్వలు



గట్టు మండలం బోయలగూడెం గ్రామంలో పత్తి పంటను తొలగిస్తున్న రైతు

గద్వాల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గద్వాల సీడ్ పత్తి విత్తనోత్పత్తిలో ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితిలో రైతులు ఉన్నారు. ఏళ్ల తరబడి సీడ్‌పత్తి విత్తనోత్పత్తిలో ఉన్న రైతులు మారుతున్న పరిణామాలు చూసి విస్తుపోతున్నారు. సీడ్ విత్తన ఉత్పత్తిపై సీలింగ్ పెట్టడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విత్తనం విత్తి నెల రోజులు గడుస్తున్న సమయంలో ఇలాంటి ఆంక్షలు పెట్టడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. గద్వాల జిల్లాలో సీడ్ పత్తి విత్తనోత్పత్తి సాగు దాదాపు 57వేల ఎకరాలలో చేశారు. ఇందులో దాదాపు 30వేల నుంచి 40వేల మంది రైతులు దీనినే నమ్ముకున్నారు. వేల మంది కూలీలకు ఉపాధిని ఇస్తుంది. వ్యవసాయ రంగంలో ఇంతటి ప్రాధాన్యం ఉన్న సీడ్‌పత్తి సాగుపై మూడేళ్ల నుంచి జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే నడిగడ్డలో సీడ్ పత్తి విత్తన ఉత్పత్తి తగ్గిపోయే పరిస్థితికి వచ్చింది.

సీలింగ్ పెట్టడంపై రైతుల ఆగ్రహం

సీడ్‌పత్తి విత్తన ఉత్పత్తిపై సీలింగ్ పెట్టడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎకరాలకు 150 నుంచి 200 ప్యాకెట్లు మాత్రమే తీసుకుంటామని కంపెనీలు చెబుతున్నాయని ఆర్గనైజర్లు చెబుతున్నారని రైతులు అంటున్నారు. ఈ విషయం ముందస్తుగా విత్తనం విత్తే సమయంలో చెబితే సీడ్ పంట వేయాలా..? వద్దా అని నిర్ణయం తీసుకునే వాళ్లం. విత్తనం విత్తి దాదాపు నెల రోజులు గడుస్తుందని రైతులు అంటున్నారు. ఇప్పటి వరకు ఎకరాకు రూ.15వేల నుంచి రూ.20వేల వరకు పెట్టుబడి పెట్టామని, ఈ సమయంలో ఉత్పత్తిపై సీలింగ్ పెట్టడం ఏమిటని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇతర పంటల విత్తనం విత్తేకాలం పోయిన తర్వాత చావుకబురు చెబుతున్నట్లు ఇప్పుడు చెబితే ఏ పంటలు వేసుకోవాలని, భూ యజమానులకు కౌలును ఎలా చెల్లించాలని ప్రశ్నిస్తున్నారు. ఎకరాకు ఎంత సీడ్ ఉత్పత్తి అవుతుందో అంత మొత్తం సీడ్‌ను తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

సీడ్‌ను తీసుకోకపోతే నిలదీస్తాం

నడిగడ్డలో సీడ్ కంపెనీలు, ఆర్గనైజర్లు రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని నడిగడ్డ హక్కుల పోరాట సమితి కన్వీనర్ రంజిత్ కుమార్ ఆరోపిస్తున్నారు. సీడ్ విత్తనం సాగై నెల రోజులు గడిచిపోయిన తర్వాత కొన్ని కంపెనీలు సీడ్‌పై ఆంక్షలు పెడుతున్నారని మొక్కలను తొలగిస్తే ఎకరాకు రూ.7500 నుంచి రూ.10వేల వరకు పరిహారం ఇస్తామని చెబుతున్నాయని అంటున్నారు. సీడ్ ఎక్కువ అయినపుడు సాగుకోసం రైతులకు సీడ్‌ను ఇచ్చే ముందు ఎంత ఉత్పత్తి కావాలో అన్ని ఎకరాలకు మాత్రమే సీడ్ ఇచ్చి సాగు చేయించుకోవాలని, ఇప్పుడు ఆంక్షలు పెట్టడం ఏమిటని ఆయన ప్రశ్నిస్తున్నారు. సీడ్‌ను కంపెనీలు తీసుకోకపోతే మళ్లీ పోరాటం చేయాల్సి వస్తుందని, అవసరమైతే కోర్టును కూడా ఆశ్రయిస్తామని హెచ్చరిస్తున్నారు.

నేను సీడ్‌ను తీసుకోను



నేను మూడు ఎకరాలలో సాగు చేశాను. కౌలు, పెట్టుబడితో కలిపి రూ.3 లక్షలు ఖర్చు అయ్యింది. ఇప్పుడు ఆర్గనైజర్ ఫోన్ చేసి పంటను తొలగించు.. ఎకరాకు రూ.7వేలు ఇస్తాను అంటున్నాడు. నేను ఎందుకు తొలగించాలి? నాకు రూ.3లక్షలు ఖర్చు అయ్యింది. ఎకరాకు రూ.లక్ష ఇస్తే తొలగిస్తాను అన్నాను. దీంతో ఆర్గనైజర్ నీ ఇష్టం ఆ పంటతో నాకు సంబంధం లేదు అని ఫోన్ పెట్టేశాడు.

\- గొర్ల తిమ్మప్ప, రైతు, ఉలిగేపల్లి, మల్దకల్ మండలం

అవకాశ వాదం ప్రదర్శించిన కంపెనీలు

కంపెనీలు రైతులతో చెలగాటం ఆడుతున్నాయి. సీడ్ నిల్వలు పెరిగిపోయి, సీడ్ విక్రయాలు తగ్గిపోయాయని గుర్తించి ఆంక్షలు పెట్టినట్లు తెలుస్తున్నది. గత ఏడాది సీడ్ పంట దిగుబడి గణనీయంగా పెరిగింది. ఎకరాకు 300 ప్యాకెట్లు పండాల్సి ఉండగా, దాదాపు 350నుంచి 450 ప్యాకెట్ల వరకు పండింది. దీంతో కంపెనీల దగ్గర ఉత్పత్తి నిల్వలు పెరిగిపోయాయి. మార్కెట్‌లో విత్తన సీడ్ విక్రయాలు పెరుగుతాయని కంపెనీలు భావించాయి కానీ ఈ ఏడాది గణనీయంగా విక్రయాలు పడిపోయాయని కంపెనీలు చెబుతున్నాయి. ఉత్తర భారత దేశంలో అనుమతులు లేని కంపెనీల సీడ్ విక్రయాలు గట్టి పోటీ ఇవ్వడంతో మార్కెట్‌లో విక్రయాలు కాక నిల్వలు మిగిలిపోయాయని కంపెనీలు అంటున్నాయి. అందుకే ఉత్పత్తిని తగ్గించాలని చూస్తున్నట్లు తెలుస్తున్నది. అయితే కంపెనీలు రైతులకు సీడ్ ఇచ్చే ముందే తగ్గించుకోవాల్సి ఉండగా గత ఏడాది మాదిరిగానే వేల ఎకరాలకు సీడ్ ఇచ్చి ఇప్పుడు నిల్వలు పెరిగిపోయాయని పలువురు చెబుతున్నారు. సీడ్‌ను తగ్గించుకోవడానికి ఉత్పత్తిపై సీలింగ్ ఆంక్షలు పెట్టడం సరైన పద్ధతి కాదని రైతులు, రైతు సంఘాలు అంటున్నాయి.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ యువకుడి మృతి

» ప్రేమించి పెళ్లి చేసుకున్న యువతి దక్కలేదని ఆత్మహత్యాయత్నం

నాగర్‌కర్నూల్ క్రైం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రేమించి పెళ్లి చేసుకున్న యువతి దక్కలేదని ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, మండలంలోని పుల్జాల గ్రామానికి చెందిన బందుల ఈశ్వర్ (28), తెలకపల్లి మండలం రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన జ్యోతి ప్రేమించుకొని, ఈ నెల 14న హైదరాబాద్‌లో పెళ్లి చేసుకున్నారు. విషయం తెలుసుకున్న యువతి తల్లిదండ్రులు హైదరాబాద్‌కు వెళ్లి వారిని కలిశారు. పెద్దల సమక్షంలో మళ్లీ పెళ్లి చేస్తామని చెప్పి తీసుకొచ్చి మల్కాపూర్ స్టేజీ వద్ద ఈశ్వర్‌ను వదిలి, జ్యోతిని తీసుకుని వారి గ్రామానికి వెళ్లిపోయారు. వారు పెళ్లి విషయం మాట్లాడకపోవడంతో మనస్తాపానికి గురైన ఈశ్వర్ ఈ నెల 20న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. గమనించిన చుట్టుపక్కల వారు అతడిని జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు ఈ నెల 22న హైదాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. సంఘటనపై మృతుడి చంద్రయ్య ఫిర్యాదు చేయడంతో, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి...


చరణ్ (ఫైల్)

అయిజ (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. అయిజ ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ మండలంలోని మేడికొండ గ్రామానికి చెందిన చరణ్(26) ఆదివారం మండల కేంద్రం నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై బయలు దేరాడు. అదే సమయంలో రమేశ్ అనే వ్యక్తి తుపతురాల నుంచి ద్విక్రవాహనంపై అయిజకు వస్తున్నాడు. రాత్రి 10:30 గంటల సమయంలో మంత్రాలయం రహదారిపై రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నాయి. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చరణ్ కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. అతడి భార్య కాన్పు నిమిత్తం పుట్టింటికి వెళ్లినట్లు తెలిసింది. మృతుడి తల్లి రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

మతి స్థిమితం లేని వృద్ధుడు...

మూసాపేట (ఆంధ్రజ్యోతి) : మతిస్థిమితం తప్పిన ఓ వృద్ధుడు పొరపాటున కలుపు మందు తాగి, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా, అడ్డాకుల ఎస్ ఎం.శ్రీనివాస్ కథనం ప్రకారం.. గుడిబండ గ్రామానికి చెందిన గౌని సురేందర్‌రెడ్డి (64)కి కొంతకాలంగా మతిస్థిమితం తప్పింది. ఈ నెల 29న నీళ్లు అనుకొని ఇంట్లో ఉన్న కలుపు నివారణ మందు తాగి అపస్మారకస్థితికి చేరాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని మహబూబ్‌నగర్ జిల్లా అసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడు నరేందర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

» ముగ్గురికి గాయాలు

ఊట్కూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురు గాయపడ్డారు. నారాయణపేట జిల్లా, ఊట్కూరు మండలంలోని అమీన్‌పూర్ వద్ద సోమవారం సాయత్రం ఈ సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వడ్ల శివకుమార్, కమ్మరి అంజనేయులు నారాయణపేటలో కార్పెంటర్ పని చేస్తున్నారు. సోమవారం పని ముగించుకొని ద్విచక్రవాహనంపై గ్రామానికి బయలుదేరారు. అదే సమయంలో మగ్దూంపూర్ గ్రామానికి చెందిన కిషోర్ నారాయణపేట మండలం బైరంకొండ గ్రామంలో ఉన్న తన భార్యను తీసుకొచ్చేందుకు ఓబ్లపూర్ మీదుగా నారాయణపేటకు వెళ్తున్నాడు. పగిడిమారి గ్రామం దాటిన తర్వాత అమీన్‌పూర్ ఎక్స్ రోడ్డు వద్ద రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నాయి. దీంతో ముగ్గురూ గాయపడ్డారు. వడ్ల శివకుమార్, కమ్మరి అంజనేయులులకు కాళ్లు విరగాయి. స్థానికులు గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని నారాయణపేటలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్ళారు. కమ్మరి అంజనేయులు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మహబూబ్‌నగర్ పట్టణంలోని ఎస్‌వీఎస్ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

శివకుమార్‌తో పాటు కిషోర్ నారాయణపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయంపై ఊట్కూర్ ఎస్‌ఐ రమేశ్‌ను సంప్రదించగా ప్రమాదం జరిగినట్లు ఫోన్ రావడంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లారని తెలిపారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసిన తర్వాత కేసు నామోదు చేస్తామని చెప్పారు.

దాయాదుల మధ్య గొడవ

» వ్యక్తిపై దాడి, కేసు నమోదు

ఖిల్లాఘణపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండలంలోని ఉప్పరిపల్లిలో దాయాదుల మధ్య ఘర్షణ జరిగింది. ఏఎస్‌ఐ సత్యనారాయణ గౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కల్వకోల్ సుధాకర్‌రెడ్డి ఈ నెల 29న సాయంత్రం పొలం వద్ద ఉండగా అతడి దాయాది గోవర్ధన్ రెడ్డి వచ్చాడు. భాగ పరిష్కారంలో తనకు రావాల్సిన పొలం కొంత మా భూమిలో ఉందంటూ గొడవకు దిగాడు. దుర్భాషలాడుతూ కర్రతో దాడి చేయగా సుధాకర్‌రెడ్డి కుడి చేతికి గాయమైంది. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు గోవర్ధన్ రెడ్డిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

పొరపాటున మరొకరి బ్యాగు తీసుకొచ్చిన ప్రయాణికురాలు

» స్వాధీనం చేసుకొని తిరిగి అప్పగించిన ఆర్టీసీ అధికారులు


జడ్చర్ల కొత్తబస్టాండులో ప్రయాణికురాలి నుంచి బ్యాగును స్వాధీనం చేసుకుంటున్న ఆర్టీసీ అధికారులు

జడ్చర్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : పొరపాటున మరొకరి బ్యాగు తీసుకొచ్చిన ప్రయాణికురాలు నుంచి బ్యాగును స్వాధీనం చేసుకుని తిరిగి సంబంధింత ప్రయాణికురాలుకు పంపించిన సంఘటన సోమవారం జడ్చర్ల కొత్త బస్టాండులో చోటుచేసుకుంది. జడ్చర్ల న్యూ బస్టాండు మేనేజర్ యాదగిరి కథనం ప్రకారం.. వీపనగండ్ల మండలం తూంకుంట గ్రామపంచాయతీ పరిధి సంపత్‌రావుపల్లికి చెందిన శంకరమ్మ కొమరవెల్లి మల్లన్నను దర్శించుకొని హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సులో బయలుదేరింది. హైదరాబాద్‌లో బస్సుదిగే సందర్భంలో అంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన మరో మహిళ బ్యాగును తీసుకొని వల్లభాపురం (కొల్లాపూర్) బస్సు ఎక్కింది. కాగా హైదరాబాద్‌లో తన బ్యాగు పోయిందంటూ ఆర్టీసీ అధికా రులకు సదరు మహిళ ఫిర్యాదు చేయడంతో సీసీ కెమెరాలను పరిశీలించారు. శంకరమ్మ చేతిలో ఆ బ్యాగును గుర్తించి, జడ్చర్ల కొత్తబస్టాండు అధికారులకు సమాచారం అందజేశారు. దీంతో జడ్చర్ల కొత్త బస్టాండులో బస్సులో ఉన్న శంక రమ్మ వద్ద ఉన్న బ్యాగును స్వాధీనం చేసుకుని, తిరిగి హైదరాబాద్ ఆర్టీసీ అధికారులకు పం పించారు. బ్యాగును స్వాధీనం చేసుకునే సంద ర్భంలో ట్రాఫిక్ గైడ్స్ వెంకటయ్య, శివరాముడు, సెక్యూరిటీ లింగంపేట నర్సిములు ఉన్నారు.

చిన్నారులకు చిరునవ్వుల వరం

» వెట్టి నుంచి విముక్తి కల్పించడమే లక్ష్యం
» తనిఖీల కోసం ప్రత్యేక బృందాల ఏర్పాటు
» నేటి నుంచి 'ఆపరేషన్ ముస్కాన్' ప్రారంభం



పేట కలెక్టరేట్‌లో అపరేషన్ ముస్కాన్‌పై అధికారులతో సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

నారాయణపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : వెట్టి చాకిరీలో బాల్యం బందీ అవుతోంది. తల్లిదండ్రుల పేదరికం, చదువుపై వారికి సరైన అవగాహన లేకపోవడం.. కారణమేదైనా కావచ్చు కానీ పుస్తకాలు పట్టుకొని బడికెళ్లాల్సిన చిన్నారులు హోటళ్లు, ఇటుకల బట్టీలు, పరిశ్రమలు, మెకానిక్, కిరాణం దుకాణాల్లో బాలకార్మికులుగా మారుతున్నారు. వారికి విముక్తి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతీ సంవత్సరం జూలైలో 'ఆపరేషన్ ముస్కాన్', జనవరిలో 'ఆపరేషన్ స్మైల్' పేరిట రెండు సార్లు ప్ర త్యేక కార్యక్రమం నిర్వహిస్తోంది. అందులో భాగంగా ఈనెల 1 నుంచి 11వ 'అపరేషన్ మస్కాన్'కు శ్రీకా రం చుట్టింది. నెలాఖరు వరకు ఈ కార్యక్రమం కొన సాగనున్నది.



ఆరేళ్లలో గుర్తించిన బాల కార్మికులు

సం.	ఆపరేషన్ స్మైల్	ఆపరేషన్ ముస్కాన్	మొత్తం	నమోదైన కేసులు
2019	53	106	159	-
2020	75	-	75	-
2021	125	61	186	-
2022	57	166	223	-
2023	170	105	275	05
2024	57	27	84	32
2025	66	-	-	02
మొత్తం	613	465	1,078	39

జిల్లా వ్యాప్తంగా తనిఖీలు

ప్రభుత్వం అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. వారు జిల్లా వ్యాప్తంగా పర్యటించి అకస్మిక దాడులు నిర్వహించనున్నది. ఇప్పటికే నారాయణపేట జిల్లా కలెక్టరెట్‌లో అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆధ్వర్యంలో డీఎస్పీ లింగయ్య పోలీసు, బాలల సంరక్షణ, కార్మిక, విద్య, వైద్య ఆరోగ్య శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆపరేషన్ ముస్కాన్‌పై దిశా నిర్దేశం చేశారు. మంగళవారం నుంచి ప్రత్యేక బృందాలు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించనున్నాయి. కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేష్ గౌతమ్ పర్యవేక్షణలో వివిధ శాఖల సమన్వయంతో బడి బయట కార్మికులను గుర్తించి, పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకోనున్నారు. అలాగే చిన్నారులను యాచక వృత్తికి పంపిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాలకార్మిక వ్యవస్థను రూపుమాపుదాం



బాలకార్మిక వ్యవస్థను రూపు మాపేందుకు ప్రజలందరూ సహకరించాలి. ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాలు నిర్వహించి ఆరేళ్లలో 1,078 మంది బాల కార్మికులకు విముక్తి కల్పించాం. ఎక్కడైనా బాల కార్మికులను పనుల్లో పెట్టుకున్నట్లు తెలిస్తే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 లేదా 100 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి. అధికారులు దాడులు నిర్వహించి వారికి విముక్తి కల్పిస్తారు. యజమానులపై కేసులు నమోదు చేస్తారు.

- యోగేష్ గౌతమ్, ఎస్పీ, నారాయణపేట

నేడు జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

» మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రధాన స్టేడియంలో నిర్వహణ

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి బాలికల జూనియర్ ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే జిల్లా బాలికల జట్టును మంగళవారం ఎంపిక చేయనున్నట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి భానుకిరణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు మంచిర్యాల జిల్లా, రామకృష్ణపూర్‌లో ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపికలకు వనపర్తి జిల్లా మినహా పూర్వ మహబూబ్‌నగర్ జిల్లా క్రీడాకారులు పాల్గొనొచ్చని తెలిపారు.

2009, జనవరి 1 నుంచి 2011, డిసెంబర్ 31 మధ్య పుట్టిన వారు ఎంపికలకు ఎంపికలకు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలతో పాటు, 2 పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో మహబూబ్‌నగర్ పట్టణంలోని జిల్లా స్టేడియానికి ఉదయం 8 గంటలకు చేరుకోవాలని సూచించారు.

నేడు 'జూరాల' పరిశీలనకు జాన్‌వెస్లీ

గద్వాల టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టు పరిశీలనకు మంగళవారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ రానున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఆయన ప్రాజెక్టు వద్దకు చేరుకుంటారని పేర్కొన్నారు. క్రస్ట్ గేట్లను పరిశీలించి, మరమ్మతులు, పూడిక తొలగింపు తదితర అంశాలను తెలుసుకుంటారని తెలిపారు.

ప్రాజెక్టు స్థితిగతులు, వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తారని తెలిపారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారని పేర్కొన్నారు. పర్యటనలో జాన్‌వెస్లీతో పాటు అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీరామ్ నాయక్ పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.

కనుల పండువగా జగన్నాథ రథయాత్ర


రథయాత్రలో జగన్నాథ స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి


రథాన్ని లాగుతున్న భక్తులు

నారాయణపేట న్యూటౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా కేంద్రంలో సోమవారం జగన్నాథ రథయాత్రను కనుల పండువగా నిర్వహించారు. ఆదిత్య నర్సింహదాసు ఆధ్వర్యంలో సరాఫ్ బజార్ బాలాజీ మందిరం నుంచి రథయాత్ర ప్రారంభమైంది. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు.

భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కే రాజ్‌కు మార్‌రెడ్డి రథయాత్ర జరుగుతున్న ప్రాంతా న్ని శుభ్రం చేశారు. సరాఫ్ బజార్ నుంచి ప్రారంభమైన రథయాత్ర సెంటర్ చౌరస్తా, ప్రధాన రహదారి మీదుగా సత్యనారాయణ చౌరస్తా వరకు కొనసాగింది. హరే రామ.. హ రే కృష్ణ.. కృష్ణ కృష్ణ హరే హరే.. అంటూ స్వామి నామస్మరణ చేస్తూ భక్తులు రథాన్ని లాగారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నందు నామాజీ, రఘు రామయ్యగౌడ్, మిర్చి వెంకటయ్య, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు, మహిళలు, యువకులు, హిందూ సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

బల్కంపేట ఎల్లమ్మకు పట్టు వస్త్రాలు

» జములమ్మ ఆలయం తరపున సమర్పణ

గద్వాల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ దేవతకు జోగుళాంబ గద్వాల జమ్మిచేడు జములమ్మ ఆలయం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం మంగళవారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జములమ్మ ఆలయం తరపున పట్టు వస్త్రాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. అలాగే ఈ ఏడాది కూడా ఆలయ చైర్మన్ వెంకటరాములు, డైరెక్టర్లు మంగళ వీరేశ్, మునిలన్నల ఆధ్వర్యంలో సోమవారం ఆలయంలో అర్చకుడికి పట్టు వస్త్రాలను అందించారు. అంతకుముందు వారికి ఆలయ చైర్మన్ సాదర స్వాగతం పలికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి, సత్కరించారు.


బల్కంపేట ఆలయంలో అర్చకుడికి పట్టువస్త్రాలు అందజేస్తున్న జములమ్మ ఆలయ చైర్మన్

షూటింగ్ పోటీల్లో ఆరేపల్లి విద్యార్థిని ప్రతిభ

» అభినందించిన క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

ఆత్మకూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : షూటింగ్ చాంపియన్‌షిప్ - 2025 పోటీల్లో వనపర్తి జిల్లా, ఆత్మకూరు మండలం ఆరేపల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని మౌనిక ప్రతిభ కనబరిచింది. మౌనిక హైదరాబాద్ నగరంలోని కీసర మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో ఇంటర్ సెకండీయర్ చదువుతోంది. గచ్చిబౌలి స్టేడియంలో ఈ నెల 26న జరిగిన పోటీల్లో కాంస్య పతకం సాధించింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో క్రీడా శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరిని కలిసిన మౌనికను ఆయన అభినందించారు. ప్రభుత్వ సలహాదారు వేమ్ నరేందర్ రెడ్డిని పరిచయం చేశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ ఆమె భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలకు సహకారం అందిస్తామని తెలిపారు. శిక్షణకు వెళ్లేందుకు రవాణా సౌకర్యంతో పాటు, రైఫిల్ కూడా అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకుడు రామచంద్రయ్య, మత్స్యసహకార సంఘం గ్రామ అధ్యక్షుడు వెంకటన్న, స్థానికులు మోహన్, బాలయ్య, రాజు సురేశ్ పాల్గొన్నారు.


కాంస్య పతకం సాధించిన చిన్నారిని అభినందిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

పాలమూరులో చిరుత కలకలం


వీరన్నపేట సమీపంలోని కొండపై ఉన్న చిరుత (వృత్తంలో)

» వీరన్నపేట సమీపంలోని కొండపై కనిపించిన పులి

మహబూబ్‌నగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం సమీపంలోని వీరన్నపేట పరిసరాలలో చిరుత కనిపించడం కలకలం సృష్టించింది. జనావాసానికి అతి సమీపంలో ఉన్న కొండపై సోమవారం ఉదయం 7:30 గంటల సమయంలో చిరుత పులి కనిపించింది. గమనించిన స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. కొందరు యువకులు సెల్‌ఫోన్‌లలో చిరుత ఫొటోలు, వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో అవి వైరల్‌గా మారాయి. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు అక్కడికి చేరుకొనేలోగా చిరుత అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఆ తర్వాత పరిసర ప్రాంతాల్లో వెతికినా చిరుత కనిపించలేదు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానికులు భయాందోళనలకు గురి కావొద్దని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిరుతను బంధించేందుకు బోను ఏర్పాటు చేస్తామని, సీసీ కెమెరాలు బిగిస్తామని చెప్పారు.

సీఎం సహాయ నిధికి రైతు భరోసా

» కలెక్టర్‌కు అందించిన రైతు లక్ష్మీకాంతరెడ్డి


కలెక్టర్‌కు రైతుభరోసా నగదును విరాళంగా ఇస్తున్న లక్ష్మీకాంతరెడ్డి

వడ్డేపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : తనకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందిన రైతు భరోసా నగదును ఓ రైతు ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళంగా అందించారు. జోగుళాంబ గద్వాల జిల్లా, కోయిలదిన్నెకు చెందిన గోరంట్ల లక్ష్మీకాంతరెడ్డికి రైతు భరోసా కింద రూ. 95,400 అయన ఖాతాలో జమ అయ్యాయి. ఈ డబ్బును ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళంగా ప్రకటించారు. దీనికి సంబంధించిన చెక్కులను సోమవారం ఐడీవోసీ సమావేశ మందిరంలో కలెక్టర్ సంతోష్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆయనను కలెక్టర్ అభినందించారు. ప్రభుత్వం నుంచి పొందిన సంక్షేమ ఫలాలను తిరిగి అందించాలన్న ఆయన దృక్పథం ప్రతీ ఒక్కరికీ ఆదర్శనీయమన్నారు.

ఎస్ఎన్ఎస్ పరిశ్రమపై విచారణ


రైతు రామిరెడ్డితో విచారణ చేస్తున్న ఆర్ఐ శంషీర్

ఎర్రవల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ఎర్రవల్లి మండల పరిధిలోని కొండేరు శివారులోని ఎస్ఎన్ఎస్ పరిశ్రమపై అధికారులు సోమవారం విచారణ చేపట్టారు. పరిశ్రమ సమీపంలో రామిరెడ్డికి చెందిన పొలం ఉంది. దానిని పరిశ్రమ యాజమాన్యం 13 ఏళ్ల లీజుకు తీసుకున్నది. దీంతో ఆ భూమి పంటల సాగుకు పనికి రాకుండా పోయిందని బాధిత రైతు ఇటీవల కలెక్టర్ సంతోష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశం మేరకు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శంషీర్ వ్యవసాయ భూమిని పరిశీలించారు. రైతు రామిరెడ్డితో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. పూర్తి స్థాయిలో విచారించి, ఉన్నతాధికారులకు నివేదికను అందిస్తామని ఆయన తెలిపారు.

జాతీయ రహదారిపై డీసీఎం బోల్తా

» వాహనాల రాకపోకలకు అంతరాయం

జడ్చర్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలం మాచారం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై డీసీఎం బోల్తాపడింది. జడ్చర్ల నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం సోమవారం తెల్లవారుజామున ఫ్లైవోవర్ సమీపంలో బోల్తా పడటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని డీసీఎంను పక్కకు తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

న్యూస్ బాక్స్

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్



సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

వనపర్తి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ అన్నారు. సోమవారం పట్టణంలోని 2వ వార్డులో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గట్టు యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. వనపర్తి పట్టణంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి హయాంలోనే అభివృద్ధి పనులు చేపట్టారని, ఆ తరువాత వచ్చిన నాయకులు మాటలకే పరిమితం అయ్యారని విమర్శించారు. కార్యక్రమంలో రమేష్ గౌడ్, పరంజ్యోతి, అశోక్, నాగన్న యాదవ్, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదు

అమరచింత, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వంపైన విమర్శలు చేయడం కోసమే సాయిచంద్ వర్ధంతి సభ పెట్టుకున్నారని కాంగ్రెస్ నాయకులు అయూబ్ ఖాన్, మహేందర్ రెడ్డి, అరుణ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం అమరచింతలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజా పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు విమర్శలు చేయడం సరికాదని సూచించారు. తమ ప్రభుత్వంపై పెరుగుతున్న ప్రజల ఆదరణను చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని వారు మండిపడ్డారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెబ్బేరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయనిధి పేదలకు ఒక వరంలాంటిదని కాంగ్రెస్ సీనియర్ నాయకులు సహదేవుడు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 10మంది లబ్ధిదారులకు రూ2,27,500 విలువైన చెక్కులను సోమవారం పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు నాయకులు పంపిణీ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నా రెడ్డి నియోజకవర్గం అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. ఆపద సమయంలో పేద ప్రజలకు అండగా నిలిచి వారి కళ్లలో వెలుగులు నింపడమే సీఎం సహాయనిధి లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మన్యం, వెంకటరత్నం నాయుడు, కృపాకర్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, ఆనంద్ సాగర్, చంద్రశేఖర్, విజయ్ గౌడ్, తిరుపతయ్య, రాము, అంజి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన రోజా

పెబ్బేరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : పెబ్బేరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఇన్‌చార్జి ఎంపీడీవోగా రోజా బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న రవీంద్ర పదవీ విరమణ పొందారు. దీంతో ఎంపీవోగా విధులు నిర్వహిస్తున్న రోజా ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు ఇన్‌చార్జి ఎంపీడీవో రోజాకు స్వాగతం పలుకుతూ పదవీ విరమణ పొందిన రవీంద్రకు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా పౌరహక్కుల దినోత్సవం



పౌరహక్కుల దినోత్సవంలో మాట్లాడుతున్న రాములు

చిన్నంబావి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిన్నమారూర్‌లో పౌరహక్కుల దినోత్సవం నిర్వాహిచారు. ఈ సందర్భంగా గిర్దావర్ రాములు మాట్లాడుతూ.. గ్రామంలో కులం పేరుతో దూషించినా అంటరానితనం పాటించినా తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం కొప్పునూర్ ఎస్సీ బాలురు హాస్టల్ వార్డెన్ విద్యార్థులకు అంటరానితనంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ అగ్రికల్చర్ అధికారి పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల తెరవండి.. పిల్లల్ని పంపుతాం

- తల్పునూరు తండా ప్రజల ఆవేదన
- రెండేళ్లుగా తెరవని సర్కారు బడి
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు



తండాలో మూతబడిన ప్రభుత్వ పాఠశాల

రేవల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాలు, అధికారులు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నామని చేస్తున్న హంగామా కేవలం ప్రకటనలకు, మాటలకు మాత్రమే పరిమితమవుతున్నాయి. వాస్తవాలకు పిల్లల భవిష్యతు కోసం వారిని చదివించాలంటే విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు కూడా ఇబ్బందులు తప్పడం లేదు.

రెండేళ్లుగా మూతబడి...

రేవల్లి మండల కేంద్రంలోని పాత తండా గ్రామ పంచాయతీకి చెందిన తల్పునూరు తండాలో రెండు సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాల మూతపడింది. నేటి వరకు పాఠశాలలో పిల్లలను చేర్పించడానికి గాని ఆ తండాలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేయడానికి గాని సంబంధిత అధికారులు ఎటువంటి కార్యక్రమాలు చేపట్టలేదు. ఎవరైనా ప్రజలు అధికారులను సంప్రదిస్తే పిల్లలు ఎవరూ రావడం లేదని, అందుకే పాఠశాల మూతపడిందని సులువుగా సమాధానం ఇస్తున్నారు. వాస్తవానికి తల్లిదండ్రులకు సరైన అవగాహన కల్పించకపోవడం, పాఠశాలలో సరైన వసతులు లేకపోవడంతోనే గ్రామంలో పాఠశాల మూతపడిందని, ప్రస్తుతానికి ఆ పాఠశాల భవనం వర్షానికి తడిసి శిథిలావస్థకు చేరుకుందని గ్రామస్థులు వాపోతున్నారు. గతంలో అక్కడ ఒకే ఉపాధ్యాయుడు ఉన్నాడని, ఇప్పటి వరకు మీ గ్రామంలో పాఠశాల తెరుస్తాం, పిల్లల్ని చేర్పించండని అడిగిన వారే లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో తలుపునూరు గ్రామంలోని ఉన్నత పాఠశాలకు విద్యార్థులను పంపించాలని అక్కడి ఉపాధ్యాయులు కోరారని సరైన రవాణా సదుపాయం లేక బస్సు వసతి లేక ప్రైవేటు పాఠశాలలకు విద్యార్థులను పంపిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం తండాలో 30 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ భవిష్యత్తులో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని వారి భవిష్యత్తు కోసమైనా గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పిల్లల కోసమే పాఠశాలకు స్థలం ఇచ్చాం..

పిల్లల భవిష్యత్తు కోసమే మా స్థలాన్ని పాఠశాల భవనానికి ఇచ్చాం. ఇక్కడ బడి ఉన్నా.. ఎవరూ పట్టించుకోవడంలేదు. సరైన వసతులు ఉండటంలేదు. అందుకే విద్యార్థుల తల్లిదండ్రులు వేరే పాఠశాలలకు పంపిస్తున్నారు. పాఠశాల ఏర్పాటు చేసి సరైన వసతులతో పాటు ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలి.

- భీముడు, తండా వాసి

పిల్లలు లేకనే మూతపడింది..



పాఠశాలకు పిల్లలు ఎవరూ రాకపోవడంతో తండాలోని ప్రభుత్వ పాఠశాల మూత పడింది. పిల్లలు వస్తే తిరిగి పాఠశాల ప్రారంభిస్తాం. అక్కడికి వెళ్లి ఆ గ్రామ ప్రజలతో మాట్లాడుతాం. పాఠశాలను ప్రారంబించడంతో పాటు వివిధ గ్రామాల్లోని పాఠశాల అభివృద్ధికి చర్యలు చేపడుతాం.

- బాల్‌రెడ్డి, మండల విద్యాధికారి

రవాణా శాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే



వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేకంగా కలిశారు. సోమవారం హైదరాబాద్‌లోని మంత్రుల సముదాయంలో మంత్రిని కలిసిన వనపర్తి జిల్లా కేంద్రంలో రవాణా శాఖ (ఆర్‌టీవో) నూతన కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వనపర్తి మండలం అప్పాయపల్లి గ్రామ శివారులో రూ.9.50 కోట్లతో జిల్లా రవాణా శాఖ కార్యాలయాన్ని నిర్మించేందుకు త్వరలోనే జీవో జారీ చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారని వివరించారు.

ఆయిల్‌పామ్ పంటలు సాగు చేసే రైతులకు ప్రోత్సాహం



సమావేశంలో మాట్లాడుతున్న దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్ పామ్ పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణ సమీపంలో రైతు తిరుపతి తన వ్యవసాయ పొలంలో పామాయిల్ మొక్కల నాటారు. ఈ సందర్భంగా ఉద్యన శాఖ అధికారులు రైతులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మెట్ట భూములకు బోరు మోటారు ద్వారా నీటి సౌకర్యం ఉన్న రైతులు ఏమి ఆలోచించకుండా వాణిజ్య పంటల్లో అధిక లాభాలు వచ్చే ఆయిల్ పామ్ సాగుపై దృష్టి పెట్టాలన్నారు. ఆయిల్ పామ్ పంట సాగు చేసుకునే రైతులు వ్యవసాయ అధికారులను సంప్రందిస్తే రాయితీతో మొక్కలు, డ్రిప్ సిస్టం పైపులు, పరికరాలు, ఎరువులు ఇవ్వనున్నట్లు చెప్పారు. అంతకు ముందు పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల మైదానంతో రూ. 33.5 లక్షలతో నిర్మిస్తున్న ల్యాబ్, లైబ్రరి భవనాలకు శంకుస్థాపన చేశారు. మార్కెట్ చైర్మన్ ప్రశాంత్, ఎంఈవో కృష్ణయ్య, మనిసిపల్ కమిషనర్ సైద య్య, ఏవో జాస్మిన్, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బోయోజ్, బీచుపల్లి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతినిత్యం ప్రజల మధ్యలోనే ఉంటా..

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



నాయకులతో మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి

వనపర్తి రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ నిత్యం ప్రజల మధ్యలో ఉండి ప్రజల సమస్యలు తీరుస్తానని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. సోమవారం వనపర్తి మండల పరిధిలోని చిమనగుంటపల్లిలో రోడ్డు ప్రమాదంలో గాయాలైన బీఆర్ఎస్ నాయకుడు విష్ణుగౌడ్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన బాగోగులు తెలుసుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం గ్రామంలో పర్యటించి బీఆర్ఎస్ పార్టీ నాయకులతో మాట్లాడారు. పదవులు నాకు శాశ్వతం కాదని, ప్రజలే నాకు శాశ్వతం అని అన్నారు. ఆయన వెంట మాణిక్యం, ధర్మనాయక్, మహేశ్వర్ రెడ్డి, రాము, ధర్మశాస్త్రి, హర్షవర్ధన్ రెడ్డి, భగవంతు, బాలయ్య తదితరులు ఉన్నారు.

శుభ్రత పాటిస్తేనే వ్యాధులు దూరం

ఆత్మకూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత కూడా పాటిస్తేనే సీజనల్ వ్యాధులు దరిచేరవని ఆత్మకూరు మునిసిపల్ కమిషనర్ శశిధర్ పేర్కొన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా సోమవారం ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని 5వ వార్డులో వార్డు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం కావడంతో వర్షపు నీరు ఇంటి పరిసరాలు చుట్టూ ఉంటే దోమలు, ఈగలు వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధులైన డెంగీ, చికెన్ గున్యా, మలేరియా వంటి వ్యాధులు సంభవించే అవకాశం ఉందన్నారు. పట్టణ ప్రజలు గుర్తించి శుభ్రత పాటించాలన్నారు. అలాగే తడి, పొడి చెత్తను వృథాగా రోడ్లపై వేయకుండా తడి పొడి చెత్త బుట్టలోనే వేసి ఆరోగ్య నియమాలు పాటించాలని సూచించారు. మునిసిపల్ వార్డు ఆఫీసర్లు, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

'మోసం చేయడం.. కాంగ్రెస్ నైజం'



ఈర్లతండాలో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ కృష్ణా నాయక్

ఖిల్లాఘణపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజలను మోసం చేయడం కాంగ్రెస్ నైజం అని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య అన్నారు. మండలంలోని ఈర్లతండా, మల్కిమియాన్‌పల్లి గ్రామాల్లో సోమవారం బీఆర్ఎస్ మండల ముఖ్య నాయకులు పర్యటించి స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ కృష్ణా నాయక్ మాట్లాడుతూ... అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని అన్నారు. రైతులకు రైతు భరోసా రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు కుంటి సాకులు చెప్తుందని అన్నారు. రైతుల వద్ద సేకరించిన ధాన్యానికి ప్రభుత్వం బోనస్ డబ్బులు వేయడం లేదని అన్నారు. గ్రామ పంచాయతీలకు నిధులు రాకపోవడంతో పరిపాలన సాగడం లేదని అన్నారు. స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్ పార్టీ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని, ఎన్నికలకు పోవడానికి ప్రభుత్వం భయపడుతుందని అన్నారు. ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజాక్షేత్రంలో భంగపాటు తప్పదని తెలిపారు. గోపాల్‌నాయక్, మన్యం గౌడ్, దేవరశెట్టి సురేందర్, టోక్య నాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజలో పాల్గొన్న నాయకులు

పెబ్బేరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సోమవారం పట్టణంలోని 12వ వార్డులో లబ్ధిదారులు బీసన్న, షీలాస్వామిలతో కలిసి కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. నిరుపేదల సొంతింటి కల సహకారం ప్రజాప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్, మండల, పట్టణ అధ్యక్షుడు విజవర్ధన్ రెడ్డి, వెంకట్ రాములు యాదవ్, మోతె రాములు, జగదీశ్వర్ రెడ్డి, దయాకర్ రెడ్డి, రమణ, శివ సాయి, సత్యనారాణ రెడ్డి, జంహగీర్, షబీర్, నరసింహ్మా, సీతారాములు గౌడ్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు



పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

వనపర్తి రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఇంటికి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలే అందుతున్నాయని మాజీ జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం వనపర్తి మండల పరిధిలోని చందాపూర్‌లో ప్రధాని నరేంద్రమోదీ 11 సంవత్సరాల అభివృద్ధి పాలన వికసిత్ భారత్ గూర్చి బీజేపీ మండల అధ్యక్షుడు సంద వెంకటేష్ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి వనపర్తి మాజీ జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, జిల్లా రథసారథి డి.నారాయణ, సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి పాల్గొని మాట్లాడారు. భారత ప్రధాని 11 సంవత్సరాల విజయోత్సవం మనిషి పుట్టినప్పటి నుంచి మనిషి చనిపోయే వరకు ప్రజలందరికీ ఉపయోగపడే పథకాలను ప్రవేశ పెట్టారని అన్నారు. అనంతరం గ్రామ పంచాయతీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రామన్నగారి వెంకటేశ్వర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్, కుమార స్వామి, జిల్లా కౌన్సిల్ సభ్యులు బాలరాజు, మండల ప్రధాన కార్యదర్శులు వాకిటి సుదర్శన్, చిన్న నరసింహ, రాఘవేందర్, శివ, వరాల సంపత్, రామకృష్ణ, వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు, వనపర్తి మండల సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం చేసిన ఆర్డీవో

చిన్నంబావి జూన్ 30(ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలో తహసీల్దార్ ఎండీ ఇక్బాల్ పదవీ విరమణ నిర్వహించారు ఈ సందర్భంగా ఆర్డీవో సుబ్రహ్మణ్యం తహసీల్దార్‌ను సన్మానించి మాట్లాడారు. మండల కార్యాలయంలో రైతులకు, విద్యార్థుల ఫైల్స్‌కు సంబంధించి సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేసేవారని గుర్తు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరలక్ష్మి, అశోక్ కుమార్, కలెక్టరేట్ ఏఓ భానుప్రకాష్, నసీరొద్దీన్, శ్రీను, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖ ప్రతిష్టను పెంచాలి



వెంకటేష్ గౌడ్‌ను సన్మానిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

- ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : పదవీ విరమణ పొందిన ఉద్యోగులు సమాజాభివృద్ధిలో పాలుపంచుకుంటూ పోలీస్ శాఖ ప్రతిష్టను పెంచాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్ఐ వెంకటేష్ గౌడ్ పదవి విరమణ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పదవీ విరమణ పొందిన వారు శేషజీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆరోగ్యంగా జీవించాలని అన్నారు. అనంతరం ప్రభుత్వం నుంచి చెందాల్సిన జీపీఎఫ్, ఇన్సూరెన్స్, భద్ర సంక్షాన్ బిల్లుకు సంబంధించి పత్రాలను అందజేశారు. డీసీఆర్‌బీ డీఎస్పీ ఇన్‌చార్జి అదనపు ఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ రామేశ్వర్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ

పోలీస్ ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులపై ఆయా మండలాల ఎస్ఐలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణిలో భాగంగా ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ... పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని, ప్రజావాణికి 14 ఫిర్యాదులు వచ్చాయన్నారు.

ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి



ప్రజలతో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యాదయ్యతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ.. ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సీఎం ప్రజావాణి, మంత్రి ద్వారా ఈ జిల్లాకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులు జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 87 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

అక్రమ డిప్యుటేషన్‌ను ఎత్తివేయాలి

నిబంధనలను తుంగలో తొక్కి వీపనగండ్ల ప్రభుత్వ పాఠశాలలో ఉన్న ఇంగ్లిష్ టీచర్‌ను ఆర్థిక లావాదేవీలతో వనపర్తికి బదిలీ చేయడాన్ని ఖండిస్తున్నామని అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్, సీపీఎం నాయకులు బాల్‌రెడ్డి తెలిపారు. డిప్యూటేషన్ రద్దు చేయాలని కోరుతూ వారు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

రైతు భరోసా రాని రైతులను ఆదుకోవాలి : సీపీఎం



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పాన్‌గల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి) : రైతు భరోసా పథకం కింద రైతు ఖాతాలో డబ్బులు జమ కాలేదని సీపీఎం మండల కార్యదర్శి బాల్య నాయక్ అన్నారు. సోమవారం కస్తూర్బా అదనపు గదులు ప్రారంభానికి వచ్చిన రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును ఆయన కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మండలంలో అధిక సంఖ్యలో రైతులకు రైతు భరోసా డబ్బులు జమ కాలేదన్నారు. తక్షణమే రైతుల సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ గోవర్ధన్ సాగర్, డీఈవో అబ్దుల్ ఘని, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, రాము యాదవ్, రవి, వెంకటేష్ నాయుడు, మధుసూదన్ రెడ్డి, బ్రహ్మయ్య, ఎస్‌వో హేమలత తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నివారణకు ప్రత్యేక చొరవ తీసుకోవాలి



మాట్లాడుతున్న మహేష్

పాన్‌గల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్ మాదక ద్రవ్యాల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని, పోరాటాల్లో యువత భాగస్వామ్యం కావాలని డీవైఎఫ్ఐ గ్రామ అధ్యక్షుడు మహేష్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని రేమద్దుల బస్టాండ్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం ఎదుట డీవైఎఫ్ఐ రేమద్దుల గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డ్రగ్స్ మాదకద్రవ్యాలను పట్టణం, గ్రామాల్లో సరఫరాకు సహకరిస్తున్న వ్యక్తులపై కఠినంగా చట్టపరంగా శిక్షించాలని పేర్కొన్నారు. డీవైఎఫ్ఐ నాయకులు బాలకృష్ణ, కుమార్, సురేందర్, వెంకటేష్, శ్రీను, అంజి, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

డీపీఆర్‌వో ఆఫీస్ సబార్డినేటర్‌కు సన్మానం

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : డీపీఆర్‌వో కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పని చేస్తున్న తిరుపతయ్య సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. వనపర్తి జిల్లాగా ఏర్పడిన నాటి నుంచి డీపీఆర్‌వో కార్యాలయంలో ఆయన విధులు నిర్వహిస్తున్నారు. సోమవారంతో తిరుపతయ్య ఉద్యోగ విరమణ చేయడంతో డీపీఆర్‌వో సీతారామ్, కార్యాలయ అధికారులు, విలేకరులు తిరుపతయ్య, దంపతులను శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి



కొత్తకోట చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

కొత్తకోట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలంటూ కొత్తకోట చౌరస్తాలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ దేవరకద్ర నియోజకవర్గ కో కన్వీనర్ భరత్ భూషణ్ మాట్లాడుతూ రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తానని కాంగ్రెస్ నాయకులు గద్దెనెక్కి అధికారం చేపట్టి మొండి చెయ్యి చూపారని ఆరోపించారు. అలాగే క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తామని యాసంగిలో రైతుల నుంచి వడ్లు కొనుగోలు చేసి రెండు నెలలు గడిచినా.. బోనస్ మాటేదన్నారు. రైతు భరోసాలో కూడా సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు బోనస్ చెల్లించి హామీల అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు ఎన్నికల హామీలు అమలు చేయాలని వినతి పత్రం అందజేశారు. శ్రీనివాస్ రెడ్డి, వెంకటెరెడ్డి, వనపర్తి శ్రీనివాస్‌రెడ్డి, నరసింహ, రాజమౌళి, బాలస్వామి, మాధవరెడ్డి, అమరేందర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, బాలు తదితరులు ఉన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

మదనాపురం : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ నెరవేర్చాలని బీజేపీ మండల ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కార్యకర్తలతో కలిసి ఆయన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ, కొనుగోలు చేసిన ధాన్యానికి బోనస్, పూర్తి స్థాయిలో రైతుభరోసా వెంటనే చెల్లించాలన్నారు. అదే విదంగా నూతన పించన్లు, ప్రతి గృహిణికి రూ. 2,500 వంటి హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని పేర్కొన్నారు. అనంతరం తహసీల్దార్ మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మాధవరెడ్డి, బాబుగౌడ్, వడ్డెరాజు, కురుమన్న, కొండన్న, భాస్కర్, శివ, రాము, పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు